సాక్షి సూర్యాపేట

మంగళవారం ; 27 ; జూన్ ; 2023



ఆదాయం రూ.22.45లక్షలు

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని హుండీలను సోమవారం సిబ్బంది లెక్కించారు. - 10లో



గిరిజన సంక్షేమానికి ..

ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్య క్షుడు కోట్యానాయక్ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 35°/26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 62 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రాజేంద్ర కుమార్, కోదాడ ఆర్డీఓ కిషోర్ కుమార్, కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌సీ విజయవంతం

సూర్యాపేట : జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల ఎఫ్‌ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెకింగ్) విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్, డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి పాటిల్ హేమంత కేశవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశీలనలో 49 బ్యాలెట్ యూనిట్లు,7 కంట్రోల్ యూనిట్లు, 22 వీవీప్యాట్లను డిఫాల్ట్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు.

దళిత బంధు అక్రమాలపై విచారణ చేయాలి



కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

దురాజ్‌పల్లి : కోదాడ నియోజకవర్గం పరిధిలోని గుడిబండ గ్రామంలో దళితబంధు పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణచేసి కారకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందించి మాట్లాడారు. గుడిబండ గ్రామంలో దళితబంధు కింద లబ్ధిదారుల ఎంపిక సమయంలో ఎంపీపీ తన అనుచరుల సాయంతో ప్రతి ఒక్కరి నుంచి రూ.2లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. ఇందుకు బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ కూడా రాయించుకున్నారని, డబ్బులు ఇవ్వని లబ్ధిదారుల నుంచి యూనిట్ కింద అందించిన గేదెలను తీసుకెళ్లారని తెలిపారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకొని తమ సొమ్ము ఇప్పించాలని లబ్ధిదారులు కోరారు. కార్యక్రమంలో కొప్పుల పద్మ, మర్రి యేసమ్మ, కందుల మేరమ్మ, జ్యోతి, రమణమ్మ, అనురాధతోపాటు మొత్తం 17 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ కోరారు. సోమవారం ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచకపోవడం దారుణమన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు అందజేయాలని కోరారు. పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో వరిసాగు వద్దని రైతులను గందరగోళ పరిచారని, నీటి సరఫరాతోపాటు వాతావరణాన్ని బట్టి ఏ ప్రాంతంలో ఏ పంట పండించాలో ఇప్పటికీ ప్రకటించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, జిల్లా నాయకులు కనుకరావు, దశరథ, నాగయ్య, సంపేట కాశయ్య, జిలేరు రాజు, భయ్య లింగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, కారింగుల వెంకన్న, పోలెబోయిన కిరణ్, పిడమర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఊపొస్తున్న వేళ.. గ్రూపుల గోల

- కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య విభేదాలు
- నియోజకవర్గ స్థాయిల్లో వర్గాలు
- భట్టి పాదయాత్రలో పలు చోట్ల బట్టబయలు
- నాయకుల తీరుతో క్యాడర్‌లో గందరగోళం

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విబేధాలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎత్తి చూపుతూ, కాంగ్రెస్ పార్టీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీఎల్పీ నాయకుడు భట్టివిక్రమార్క పాదయాత్ర చేస్తుండగా.. అధిష్ఠానం పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలతో కాంగ్రెస్‌కు కొత్త ఊపు వస్తుంటే.. నియోజకవర్గ స్థాయి నాయకుల మధ్య వర్గపోరు కార్యకర్తలను గందరగోళానికి గురిచేస్తోంది.

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ

దేవరకొండ నుంచే బహిర్గతం

దేవరకొండలో వర్గపోరుతో కేడర్‌లో అయోమయం నెలకొంది. టికెట్ల లొల్లి అప్పుడే ప్రారంభమైంది. నేతల మధ్య నెలకొన్న విభేదాలు భట్టి పాదయాత్ర సందర్భంగా బయటపడ్డాయి. మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌తోపాటు నేనావత్ కిషన్ నాయక్, రవినాయక్, కేతావత్ బిల్యానాయక్ అనుచరులు కొట్టుకునే స్థితికి వచ్చారు. కొండమల్లేపల్లిలోనూ భట్టి యాత్రలో తన పేరును ప్రస్తావించలేదని భట్టి సమక్షంలోనే బాలూ నాయక్ చేతిలో మైక్‌ను కిషన్‌నాయక్ లాక్కున్నారు. దీంతో అసహనానికి లోనైన భట్టి.. సమన్వయంతో ఉండాలని హెచ్చరించారు. అంతకుముందు నేరెడుగొమ్ము మండలంలో బాలునాయక్ వర్గానికి రవినాయక్ వర్గానికి మధ్య తోపులాట చోటుచేసుకుంది.

బలం నిరూపించుకునేందుకు..


నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు మూడు వర్గాలుగా విడిపోయారు. డీసీసీ మాజీ అర్గనైజింగ్ సెక్రటరీ దైద రవీందర్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరునిగా సొంతంగా పార్టీ కార్యక్రమాలు చేసుకుంటుండగా, మాజీ మంత్రి జానారెడ్డి అనుచరుడు కొండేటి మల్లయ్య నకిరేకల్‌లో మకాం వేసి వేరుగానే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాజాగా సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య వర్గం నియోజకవర్గంలో కార్యక్రమాలను మొదలు పెట్టింది. భట్టి పాదయాత్ర సందర్భంగా ముగ్గురూ తమ ఉనికి కోసం బలనిరూపణకు దిగారు.

ఇన్‌చార్జీలు లేరు

తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఇన్‌చార్జీలు అంటూ ఎవరూ లేకుండాపోయారు. గతంలో పోటీ చేసిన అద్దంకి దయాకర్ నియోజకవర్గానికి అసలు రావడం లేదని కార్యకర్తలే బహిరంగంగా చెబుతున్నారు. అప్పుడప్పుడు ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతమ్, వడ్డెపల్లి రవి, జ్ఞానసుందర్ వచ్చిపోతున్నారు. ఎవరు కూడా కార్యకర్తలకు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది.

మిర్యాలగూడలో ..

కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి జానారెడ్డితో పాటు ఆయన కుమారుడు రఘువీర్ రెడ్డి, సామాజికవేత్త బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి ఎవరికి వారే కార్యక్రమాలు చేస్తున్నారు. సేవా కార్యక్రమాలతో లక్ష్మారెడ్డి ముందుకు వెళుతుండగా, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ జిల్లా అధ్యక్షునిగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గతంలో పీఆర్‌పీ నుంచి పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన అమరేందర్‌రెడ్డి వేరుగానే కార్యక్రమాలను చేసుకుంటున్నారు.



పరస్పర దాడులకు దిగిన అనుచరులు

సూర్యాపేట నియోజకవర్గంలోనైతే వర్గపోరు తీవ్ర స్థాయికి చేరింది. భట్టి పాదయాత్ర సందర్భంగా మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి వర్గీయులు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి వర్గీయులు పరస్పర దాడులకు దిగారు. సూర్యాపేట జిల్లాలోకి భట్టి యాత్ర ప్రవేశిస్తున్న సమయంలో కుసుమవారిగూడెంలోనూ ఇరు వర్గీయులు శనివారం కొట్టుకున్నారు. ఆదివారం కూడా మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గోపయ్య విగ్రహం వద్ద కర్రలతో పరస్పర దాడులకు దిగడంతో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో టికెట్ కోసం దామోదర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పోటీ పడటం, టికెట్ దామోదర్‌రెడ్డికే రావడంతో ఇద్దరి మధ్య విభేదాలు అప్పటి నుంచే కొనసాగుతున్నాయి.

మునుగోడులో ఎవరికి వారే..

మునుగోడు నియోజకవర్గంలో మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు కొనసాగుతునే ఉన్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీలో ఉండగా ఆయన వర్గం, పాల్వాయి స్రవంతి వర్గాలు కొనసాగాయి. ఆయన బీజేపీలో చేరాక చలమల్ల కృష్ణారెడ్డి రంగంలోకి దిగినా టికెట్ స్రవంతికే వచ్చింది. దీంతో వర్గపోరు తీవ్రంగా మారింది. ప్రస్తుతం కృష్ణారెడ్డి, స్రవంతి వేర్వేరుగానే గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఇటీవల కృష్ణారెడ్డి గ్రామ, మండల, బ్లాక్ కమిటీలను నియమించారు. వీటిల్లో స్రవంతి వర్గానికి చెందిన వారు లేకపోవడంతో ఆమె తీవ్ర అసహనంతో ఉన్నట్లు తెలిసింది. ఆమె కూడా తన వర్గం వారితో కమిటీలను ప్రకటించేలా పీసీసీకి జాబితాను పంపించారు. దీంతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.

ఆలేరులో గందరగోళం

ఆలేరు నియోజకవర్గంలో నేతల మధ్య సఖ్యత లేదు. భట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డి, బీర్ల ఐలయ్య వర్గాల మధ్య ఉన్న విబేధాలు బయట పడ్డాయి. మరోవైపు ఆలేరు మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్ జెడ్పీటీసీగా ఉంటూ తన వర్గాన్ని కాపాడుకునే పనిలో ఉన్నారు. బీర్ల ఐలయ్యకు వ్యతిరేకంగా కల్లూరి రామచంద్రారెడ్డి, కుడుదుల నగేష్, బండ్రు శోభారాణి, జనం ఉపేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, వంచ వీరారెడ్డి సమావేశం కావడంతో కేడర్‌లో గందరగోళం నెలకొంది. ఇక భువనగిరిలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గం, కుంభం అనిల్‌రెడ్డి వర్గం వేర్వేగా కార్యక్రమాలు చేస్తున్నారు.

నాలుగు నియోజకవర్గాల్లో ఓకే..

నల్లగొండ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టికెట్ల కోసం పోటీపడే నేతలు లేరు. ఆ నియోజకవర్గాల్లో విభేదాలు పెద్దగా లేవని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. నల్లగొండలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కాదని టికెట్ అడిగే స్థాయి నాయకులు లేరు. సాగర్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి, హుజూర్‌నగర్‌లో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి దీటుగా ఎదురు నిల్చునే నాయకులు లేకపోవడం గమనార్హం. నల్లగొండ నుంచి తానే పోటీచేస్తానని గతంలోనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. అయితే మొదట కోమటిరెడ్డి వర్గంలో ఉన్న దుబ్బాక నర్సింహారెడ్డి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. టికెట్ కావాలన్న ఆశ ఆయనకు ఉన్నా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రంగంలో ఉంటే కష్టమే. ఇక కోదాడలోనూ వర్గ విభేదాలు లేవు. ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతిరెడ్డి పర్యటనలకు కొందరు నాయకులు గైర్హాజరవుతున్నా, పోటీగా నిలిచే నేతలు పెద్దగా లేరు.

ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం



చివ్వెంల మండలం రాజు తండాలో పాదయాత్ర చేస్తున్న సీఎల్పీనేత భట్టి. చిత్రంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న

- వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

చివ్వెంల(సూర్యాపేట) : 'కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తాం.. ధరణి వల్ల భూములు కోల్పోయిన వారికి తిరిగి ఇప్పిస్తాం' అని సీఎల్పీనేత భట్టి విక్రమార్క అన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం చివ్వెంల మండలంలోని బీబీగూడెం, కొండల రాయినిగూడెం, మున్యానాయక్‌తండా, కర్వీ నాగారం, రాజుతండా, పాండ్యానాయక్‌తండా, జెగ్గుతండా, మోదిపురం గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా మున్యానాయక్‌తండా, రాజుతండాలో భట్టి మాట్లాడారు. 'వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే.. మీకష్టాలన్నీ తీరుతాయి' అని భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి రాజుతండా వరకు రహదారి మట్టికొట్టుకు పోయిందని, మొత్తం మట్టిరోడ్డుమీద తాను కూడా నడిచి వచ్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజుతండాకు బీటీ రోడ్డు వేస్తామని, గ్రామంలో డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని, సీసీరోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. తొమ్మిది నెలల క్రితం హత్యకు గురైన నిఖిల్ కేసును ఇంత వరకు పోలీసులు ఛేదించలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిందితులు ఎంతటివారైన శిక్షిస్తామన్నారు. పాండ్యానాయక్ తండాకు చెందిన ధరావతు భిక్షం తనకు రెండు కళ్లు లేవని పెన్షన్ ఇప్పించాలని భట్టికి వినతి పత్రం అందజేశారు. అధికారంలోకి రాగానే పింఛన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. యాత్రలో అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ప్రజలను, విద్యార్థులను ఆత్మీయంగా పలకరించుకుంటూ ముందుకు సాగారు. జెగ్గుతండా మహిళలు జొన్నరొట్టెలు చేసి పెట్టడంతో అక్కడ తిన్నారు. అనంతరం మోదిన్‌పురం గ్రామానికి చేరుకుని బస స్థలానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. చిత్రంలో ఆర్డీ ఆర్

నేడు తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల్లో యాత్ర

చివ్వెంల మండల పరిధిలోని తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల్లో మంగళవారం భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సాగనుంది, అనంతరం కోదాడ నియోజక వర్గంలోకి ప్రవేశించనుంది.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి తేదీన పెన్షన్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఆర్‌లు మంజూరు చేయాలని, పెన్షనర్లకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు హమీద్‌ఖాన్, దండ శ్యాంసుందర్‌రెడ్డి, సూదగాని నాగేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్‌తో యువకులు, విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్ ఏర్పాటు చేశారు. ఇందులో ఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి జ్యోతి పద్మ, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఎస్పీ నాగభూషణం, డీఐఈఓ కృష్ణయ్య, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, డైరెక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

పోలీస్ గ్రీవెన్స్‌డేలో 10 ఫిర్యాదులు

సూర్యాపేట క్రైం: పోలీస్ గ్రీవెన్స్‌డేలో 10 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ప్రజలనుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడితో మాట్లాడి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలపై వేగంగా స్పందించి వారికి భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు.

తొలిరోజు 89,159 మంది రైతులకు రైతుబంధు

భానుపురి (సూర్యాపేట) : ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా అందించే రైతు బంధు డబ్బులు సోమవారం నుంచి జమ అవుతున్నాయి. తొలిరోజు జిల్లాలో ఎకరం లోపు భూమి ఉన్న దాదాపు 89,159 మంది రైతుల ఖాతాల్లో రూ.27,74,06,035లు జమ చేశారు. రెండో రోజు రెండెకరాల లోపు, మూడవ రోజు మూడెకరాల లోపు ఇలా రైతులకు విడతల వారీగా డబ్బులు అందనున్నాయి. జిల్లాలో మొత్తం 2,89,172 మంది రైతులకు ఈ రైతుబంధు సొమ్ము రానుంది.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

రామగిరి(నల్లగొండ) : యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ తార్నాకలోని ఉస్మానియా క్యాంపస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నల్లగొండ స్టడీ సెంటర్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జూన్ 26 నుంచి జూలై 10వ తేదీ వరకు www.tsstudycirle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. అడ్మిషన్ పొందిన వారికి నెలకు రూ.5 వేలు, స్టడీ మెటీరియల్ ఇస్తారని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్ వర్మ విమర్శించారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 14 రోజులు కావొస్తున్నా ఇంత వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేయలేదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పది నెలలుగా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ బిల్లులు అందలేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వేలాది రూపాయలు అక్రమంగా విద్యార్థుల నుంచి దండుకుంటున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్ కుమార్, శ్రీను నాయక్, వినయ్, మహేష్, నరేష్ నవీన్ సురేందర్, రవి, చరణ్, అరుణ్, గోపి, కవిత, స్వప్న, జ్యోతి పాల్గొన్నారు.

పక్కాగా సాగు భూముల లెక్క

- ఏఈఓల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ
- నీటి పారుదల కింద 5,21,861 ఎకరాలు
- వర్షాధారం కింద 95,316 ఎకరాలు
- నివేదిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

నాగారం : జిల్లాలో సాగు భూముల లెక్క తేలింది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూముల స్థితిగతులు తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఏఈఓలు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి వర్షాధారం, ప్రాజెక్టులు, చెరువుల కింద సాగవుతున్న భూముల వివరాలను సేకరించి నివేదిక సిద్ధం చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..

వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పంటలు చేతికొచ్చే సమయానికి అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా నష్టాలు చవిచూస్తున్నారు. వీటి నుంచి అన్నదాతలను కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సాగు కాలాన్ని నెల రోజులు ముందుకు జరిపి పంట ఉత్పత్తులకు భరోసా కల్పించాలని వానాకాలం, యాసంగి పంటల ప్రణాళికలను తయారు చేయాలని భావించింది. వాస్తవంగా సాగు లెక్కలను ఏటా రెండు సీజన్లలో ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వారీగా పంటల వివరాలను సేకరిస్తారు. వర్షాధారం, సాగునీటి వనరుల కింద సాగవుతున్న భూములు, పంటల వివరాలు నమోదు చేయడం లేదు. రెవెన్యూ, జిల్లా ప్రణాళిక, సాగునీటి శాఖ, విద్యుత్ శాఖల వివరాల్లో సమాచారం సంతృప్తికరంగా లేదు. దీంతో ఆయా శాఖల సమన్వయంతో సమగ్ర సమాచారం సేకరించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం మార్గదదర్శకాలను రూపొందించి ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా వ్యవసాయ శాఖ నివేదికను సిద్ధం చేసింది.



సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ

సాగు ఇలా..

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం గత వానాకాలంలో 6,17,177 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు కాగా ఇందులో 4.71లక్షల ఎకరాల్లో వరి వేశారు. ఈ ఏడాది జిల్లాలో 6.32 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 6,17,177 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. వీటిలో నీటి పారుదల కింద 5,21,861, వర్షాధారం కింద 95,316 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తారని నివేదికలో పొందుపర్చారు. వీటిలో బోరుబావుల కింద 1,23,815 ఎకరాలు, బావుల కింద 23,227 ఎకరాలు, కాలువల కింద 2,77,220, ఎత్తిపోతల పరిధిలో 31,187, చెరువులు కింద 41,307 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

సర్వే పూర్తయింది



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల వారీగా వర్షాధారంతో పాటు, సాగునీటి సౌకర్యంతో పండించే పంటల విస్తీర్ణం ఎంత అనే వివరాలు సేకరించాం. సీజన్ ప్రారంభంలో పంటల వారీగా సర్వే జరుగుతుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే చేసి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం.

– రామారావు నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, సూర్యాపేట.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

నాగారం : పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. నాగారం మండలం పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన కడియం నాగమణి(35) ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లి అక్కడ గడ్డిమందు తాగింది. చుట్టుపక్కల వారు గమనించి కటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆమెను సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి స్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాగమణి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

కుక్కల దాడిలో మూగజీవాలు మృతి

మఠంపల్లి : కుక్కల దాడిలో మూగజీవాలు మృతిచెందాయి. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మోడె ముత్యాలు యాదవ్ కుటుంబ సభ్యులు సోమవారం దొడ్డిలో జీవాలను తోలి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో కుక్కల గుంపు దాడి చేసి పది గొర్రెలు, మేకలను చంపేశాయి. రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఉపకులాలకు దళితబంధు యూనిట్లు ఇవ్వాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో ఎస్సీ ఉపకులాలకు 40 శాతం యూనిట్లు కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గద్దం యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి డాకూరి లింగన్న కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ దళితబంధు పథకం ద్వారా ఇప్పటివరకు ఎస్సీ జాబితాలో ఉన్న 59 కులాల్లో కేవలం రెండు కులాలకు న్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రెండో విడత దళితబంధులో అన్ని ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకుడు డాకూరి వెంకన్న, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

డీవీ కృష్ణ ఆశయాలు సాధిద్దాం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మార్గదర్శి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ. కృష్ణ ఆశయాలను సాధిద్దామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ అన్నారు. సోమవారం డీవీకే ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. డీవీకే ఉద్యమ స్ఫూర్తితో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ నాయకులు జీవన్, వాజిద్, పీవైఎల్ జిల్లా నాయకులు వీరబాబు, పీఓడబ్ల్యూ నాయకులు శైలజ, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ మ్యాక్స్ క్రెడిట్ కో-ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ ఎఫ్.పి. బ్యాంక్

మా యొక్క సంస్థ నందు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మండలాల వారీగా మా యొక్క బ్రాంచెస్ నందు పనిచేయుటకు బ్యాంకింగ్, చిట్‌ఫండ్ నందు కనీసం 2 సంవత్సరాల పైన అనుభవం గలవారు మార్కెటింగ్ ఆఫీసర్ లుగా కావలెను.

Salary: ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటీవ్ + అలవెన్స్.

Age: 24 Above, Qualification: Any Degree

బ్రాంచెస్: 1. నార్కట్‌పల్లి, 2. నల్గొండ, 3. నకిరేకల్

Contact: 7815955438, 9959246443

Address: Opposite Police Station, Main Road, Narketpally - 508114

నీలగిరిలో విషాదం



నల్లగొండలోని బర్కత్‌పురలో ఫ్రూట్ కంపెనీ వద్ద గుమిగూడిన జనం



ఘటనాస్థలిలో రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

- గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతిచెందిన ఇద్దరూ పేద కుటుంబాల వారే..
- వీరిద్దరి సంపాదనపైనే ఆధారపడిన రెండు కుటుంబాలు
- మిన్నంటిన మృతుల కుటుంబ సభ్యుల రోదనలు
- ప్రమాదానికి గల కారణాలపై లోతుగా పోలీసుల విచారణ



మాంసం ముద్దగా మారిన మృతదేహం



పేలుడుధాటికి ధ్వంసమైన బైక్

నల్లగొండ క్రైం : గతంలో ఎన్నడూ లేని విధంగా ఫ్రూట్ కంపెనీ కోల్డ్ స్టోరేజీలో ఇథిలిన్ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందడంతో నీలిగిరివాసులు ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని బర్కత్‌పురకు చెందిన అబ్దుల్ సలాం సాబ్‌కు కుమారుడు కలీం(42)తో పాటు ఆరుగురు కుమార్తెలు సంతానం. చిన్నాచితకా వ్యాపారం చేస్తూ పిల్లలను పెంచి పోషించిన సలాం అందరికీ వివాహాలు జరిపించాడు. కలీం చిన్న తనం నుంచే పండ్ల వ్యాపారం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఏడేళ్ల క్రితం కలీం బర్కత్‌పురాలో సొంతంగా న్యూ స్టాక్ ఫ్రూట్ కంపెనీ పేరిట కోల్డ్ స్టోరేజ్ నిర్వహిస్తూ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఇతడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు సంతానం. ప్రస్తుతం కుటుంబ సభ్యులంతా సలీం సంపాదనపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులు ప్రమాదం అనంతరం ఘటనాస్థలిలో రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ప్రమాదంలో మృతిచెందిన ఆటో డ్రైవర్, కూలీగా పనిచేస్తున్న సాజిత్‌ది కూడా నిరుపేద కుటుంబమే. బొట్టుగూడ ప్రాంతానికి చెందిన సాజిత్ ఐదేళ్లుగా కలీం ఫ్రూట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతడిని భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. సాజిత్ కష్టపడితేనే ఆ కుటుంబం పూట గడుస్తదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో సాజిత్ చనిపోయాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బతికేది ఎట్లా దేవుడా అంటూ గుండెలవిసేలా రోదించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పట్టణవాసులు పెద్ద సంఖ్యలో బర్కత్‌పురలోని ఫ్రూట్ మార్కెట్ వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. కోల్డ్‌స్టోరేజ్‌లో సంభవించిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందడంతో నల్లగొండ పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుభవం ఉన్నా.. ప్రమాదం ఎలా..?

నీలగిరిలో కొన్నేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్న కలీంకు అరటి, మామిడి పండ్లను మాగబెట్టి విక్రయించడంలో మంచి అనుభవమే ఉందని తోటి వ్యాపారులు చెబుతున్నారు. కోల్డ్ స్టోరేజీలో సుమారు పది మంది వరకు పనిచేస్తున్నా ఇథిలిన్ గ్యాస్ సిలిండర్‌ను ఏసీలోకి ఎక్కించడం, మార్చడం వంటి పనులు కలీంతో పాటు నమ్మకస్తుడైన సాజిత్ మాత్రమే చేస్తుంటారని తెలిసింది. సిలిండర్ మారుస్తూ ఇథిలిన్‌ను మోతాదుకు మించి ఏసీలో ఎక్కించడం ద్వారానే పేలుడు సంభవించి ఉంటుందని అనుమానిస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌ను మార్చేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఏమరపాటుగా వ్యవహరించారా? లేదా మరో కారణం ఏమైనా ఉంటుందా అని పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

రూ.పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : ఎంపీ

నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని బర్కత్‌పురాలో న్యూ స్టాక్ ఫ్రూట్ కంపెనీ కోల్డ్ స్టోరేజ్‌లో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు వ్యక్తులు చనిపోవడంపై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. వ్యక్తి గతంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటానని ఎంపీ కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

కుటుంబాలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

నల్లగొండ టూటౌన్ : గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక ప్రకటనలో సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని పోలీసులను కోరారు.

పీఏసీఎస్ ఎదుట పెట్రోల్ బాటిల్‌తో నిరసన

చందూరు : తరుగు పేరిట దగా చేస్తున్నారని ఆరోపిస్తూ చందూరు పీఏసీఎస్ ఎదుట సోమవారం ఓ రైతు పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట గ్రామానికి చెందిన కౌలు రైతు కందారి అంజనేయులు ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పండించి 234 వరి ధాన్య బస్తాలను చండూరు కొనుగోలు కేంద్రంలో ఈ నెల 6న విక్రయించాడు. ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు ఆ రోజు ఎలాంటి రశీదు ఇవ్వలేదు. నగదు బ్యాంకు నేటికి జమ కాక పోవడంతో రైతు శుక్రవారం సహకారం సంఘం అధికారులను సంప్రదిస్తే 26 బస్తాలు మిల్లు యాజమాన్యం కట్‌చేసిందని.. 208 బస్తాలకు రశీదు రాసి ఇవ్వడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. సోమవారం వెళ్లి మళ్లీ అధికారులను సంప్రదించినా అదే సమాధానం రావడంతో కింటాకు 10కిలోల చొప్పుల కట్ చేస్తే ఎలా అంటూ నిలదీశాడు. అనంతరం వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌తో సహకార సంఘం ముందు నిరసనకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని రైతుకు నచ్చ జెప్పి తహసీల్దారు కార్యాలయానికి తీసుకెళ్లారు. రైతు నుంచి తహసీల్దారు వివరాలు తెలుసుకుని కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



శివకుమార్(ఫైల్)

నార్కట్‌పల్లి : చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన ఏల శివకుమార్(30) ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. తిగిరి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం పొలాల వద్దకు వెళ్తున్న రైతులకు గ్రామ సమీపంలోని చెరువులో శివకుమార్ విగతజీవుడిగా కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శివకుమార్ తన స్కూటర్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండవచ్చని భావిస్తున్నారు. స్కూటర్ కూడా చెరువులోనే కనిపిస్తుండటంతో ఇది ప్రమాదమే అని స్థానికులు పేర్కొంటున్నారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఎస్‌ఐలు సైదాబాబు, నర్సిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం

భువనగిరి టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రు అనిల్, వనం రాజు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని దశాబ్ది ఉత్సవాల్లో గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అందించలేదన్నారు. 24 వేల టీచర్ పోస్టులు, 12 వేల లెక్చరర్ పోస్టులు ఖాళీలు ఉన్నా ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ అవుతున్నా కనీసం స్పందించే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్‌లో ఫీజుల నియంత్రణపై చర్యలే లేవన్నారు. జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదని, ఈ విషయంలో ప్రైవేట్‌కు వత్తాసు పలుకుతున్న స్నోపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం లోనికి పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చింతల శివ, కానుల నరేష్ జిల్లా ఉపాధ్యక్షులు లావుడ్య రాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ఈర్లరాహుల్, వట్టిపల్లి శివ మేకల జలంధర్, పల్లెర్ల సందీప్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుగ్గ ఉదయ్ రాజబోయిన రవి, తిగుళ్ల శ్రీనివాస్, శ్రావణ్ రెడ్డి ఎండి నేహాల్ ,ఎండి రెహన్, ఈర్ల కార్తీక్, రాయమోజు రమణ సాయి, లోకదాస్ పవన్ పాల్గొన్నారు.

యాదాద్రిలో స్థానికేతరులకు ఉద్యోగాలిచ్చారు..

- ఆధార్‌కార్డులు మార్చి అవకాశం కల్పించారని నాయీబ్రాహ్మణుల ఆరోపణ



యాదగిరిగుట్టలో సమావేశమైన నాయీబ్రాహ్మణులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్థానికేతరులకు ఉద్యోగాలిచ్చారని కొండ కింద గల నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఆరోపించారు. యాదగిరిగుట్టలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కల్యాణ కట్ట నియామకాల్లో అవకతవకలు జరిగాయని తెలిపారు. సంబంధిత అధికారులు ఆధార్‌కార్డులు మార్చి బంధువులు, తెలిసిన వారిని 48మందిని కల్యాణ కట్టలో చేర్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ పునర్నిర్మాణం, రోడ్డు విస్తరణ పనుల కారణంగా ఉపాధి కోల్పోయామని తెలిపారు. దుర్భర జీవితం గడుపుతున్న తమకు యాదాద్రి ఆలయంలోని కల్యాణ కట్టలో అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో జంపాల రాజు, అన్నరం సత్యనారాయణ, కెలపు వెంకటేష్, పయ్యావుల నర్సింహ, జంపాల నవీన్, సాయి, అంబరీష్, నరేష్, కుమార్, సందీప్, కృష్ణ, భువనగిరి ఆంజనేయులు, సంఘ శివకుమార్ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



రాజాపేట గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి సూర సుమలత

రాజాపేట: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలైతే జీవితం నాశనం అవుతుందని ఆలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, రాజాపేట మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ సూర సుమలత అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం మాదక ద్రవ్యాల వ్యతిరేకంగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగంతో ఆర్థిక, ప్రాణ నష్టంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు మూల కారణమై కేసులపాలు అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహ్మాచారి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావుల రవీందర్‌రెడ్డి, న్యాయవాదులు రమేష్, శ్రీనివాస గౌడ్, సాయికృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

కుమారుడిని చూసేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం
- చిన్నారికి తప్పిన ప్రమాదం



మృతదేహాన్ని తరలిస్తున్న ఎస్‌ఐ సైదాబాబు

నార్కట్‌పల్లి : గురుకుల పాఠశాలలో చదువుతున్న కుమారుడిని చూసేందుకు కుమార్తెతో కలిసి వెళ్తున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ ఘటనలో చిన్నారికి ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన బొడ్డు రమణ-విజయ్‌కుమార్ దంపతులకు పదేళ్ల కుమారుడు సాత్విక్‌తో పాటు రెండేళ్ల కూతురు ఉంది. సాత్విక్ నార్కట్‌పల్లి మండలం పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ సమీపంలోని ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. రమణ(35) కుమారుడిని చూసేందుకు కుమార్తెతో కలిసి సోమవారం ఆర్టీసీ బస్సులో ఎల్లారెడ్డిగూడేనికి చేరుకుంది. గురుకుల పాఠశాల వద్ద బస్సు దిగి అద్దంకి -నార్కట్‌పల్లి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న లారీ రమణను ఢీకొట్టింది. ప్రమాదంలో రమణ చేతిలో ఉన్న చిన్నారి ఎగిరి రోడ్డు అవతల పడిపోగా రమణ లారీ చక్రాల కింద నలిగి అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన బాలికను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. నార్కట్‌పల్లి ఎస్‌ఐ సైదాబాబుతో పాటు ఎంపీపీ నరేందర్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. టైరుకింద ఇరుక్కున్న మృతదేహాన్ని వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలయ్యాయి. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన ఆవుల మధు విద్యుత్ శాఖలో ప్రైవేట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురవడంతో స్తంభంపై నుంచి కిందపడ్డాడు. గ్రామస్తులు అతడిని హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడిని మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ రాధికా దేశ్‌ముఖ్ దంపతులు పరామర్శించారు.

బలహీన వర్గాలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి టౌన్: భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మాయిపల్లి (11వ వార్డు)లో గల సర్వేనంబర్ 118లోని 2 ఎకరాల 32 గుంటల భూమిని బలహీన వర్గాలకు ఇళ్లస్థలాలుగా కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడారు. గతంలో ఇళ్లస్థలాలకు కేటాయించిన ఈ భూమిని ప్లాంట్లు చేసి పంచాలని రెండేళ్లుగా పోరాడుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ స్థలంలో ఇళ్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, సీపీఐ భువనగిరి పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తుపుల అభిలాష్, 11వ వార్డు శాఖ కార్యదర్శి చింతల పెంటయ్య, మర్రిపల్లి రాములు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

Flat for sale @Nalgonda Town Ready to Occupy 2&3 bhk as per Vasthu good Ventilation, Carparking. Ph: 9030195000, 9030009059 [H-778999]

Wanted

కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కోదాడ నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన బస్ డ్రైవర్స్, సెక్యూరిటీ గార్డ్స్, లేడి కంప్యూటర్ ఆపరేటర్, GNM (B.Sc నర్సింగ్) కావలెను. సంప్ర॥ 9666633376 [Y-784368]

మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221323]

నల్లగొండ నుండి నకిరేకల్‌కి పోయే దారిలో చందనపల్లి గ్రామ శివారులో గల విలేజ్‌జేష్‌లో పనిచేయుటకు కుక్కింగ్ మాస్టర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం & ఉచిత వసతి ఇవ్వబడును. సంప్ర॥9553368304, 9494352104 [Y-798227]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఉచిత వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [H-793449]

వినాయక హోమ్‌కేర్ సర్వీసెస్‌లో, బేబికేర్, పేషెంట్‌కేర్, ఇంటిపని,వంటపని చేయుటకు లేడీస్ కావలెను.భార్య-భర్త కూడ కావలెను. జీతం :15-20వేలు. 8247637946, 7816001148 [HA-30109]

ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6172]

ప్రకటన కొంచెం! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010422240, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మిరప సాగుకు అనువైన సమయం ఇదే..

- ఉద్యానవన శాఖ అధికారి మురళి సూచనలు



ట్రేలలో పెరుగుతున్న మిరప నారు

పాడి పంట

పెద్దవూర: గత వానాకాలం సీజన్‌లో మిరప పంటకు అధిక ధరలు పలకడంతో ఈ యేడాది అధిక విస్తీర్ణంలో సాగు చేయటానికి సిద్ధం అవుతున్నారు. మిరప పంటలో సాగు విధానం, యాజమాన్య పద్ధతుల గురించి ఉద్యానవన శాఖ అధికారి మురళి వివరించారు. పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ, మిరప చేను చుట్టూ రక్షణ పంటలుగా హైబ్రిడ్ జొన్న లేదా మొక్కజొన్న రెండు లేదా మూడు సాళ్లలో వేయాలి. కీటక ఆకర్షణ(ఎర) పంటలుగా బంతి, ఆముదాన్ని పొలంలో అక్కడక్కడా వేయాలని సూచిస్తున్నారు. మిరప సాగుకు ఉదజని సూచిక(పీహెచ్) 6 నుంచి 6.5 ఉన్న నేలలు అత్యంత అనుకూలమని చెబుతున్నారు.

వాతావరణం, విత్తే సమయం

మిరప పంట అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకోగలదు. మిరపకు 10 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత అనుకూలం. ఎండు మిరప కోసం వేసే పంటను వానాకాలం సీజన్‌లో వేసుకోవడం మంచిది. పచ్చి మిరప కోసం సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చు. సాధారణంగా మిరప పంటను ఖరీఫ్ సీజన్లో జూలై, ఆగస్టు నెలల్లోనూ, యాసంగిలో అయితే అక్టోబర్, నవంబర్ నెలలో సాగుకు అనుకూలం.

నేల తయారీ : పొలాన్ని వేసవిలో లోతుగా దున్ని, ఆఖరి దుక్కిలో ఎకరానికి 10టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండి, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. అలాగే 90కిలోల పశువుల ఎరువు, 10కిలోల వేపపిండి, 2కిలోల ట్రైకోడెర్మావిరిడి శిలీంద్రపు పొడిని కలిపి 10-15 రోజులు నీడలో ఉంచి శిలీంద్రం వృద్ధి చెందిన తర్వాత ఆఖరి దుక్కిలో వేసినట్లైతే తొలి దశలో మొక్కలను ఆశించే తెగుళ్ల నుంచి కాపాడవచ్చు. పంట సాగు భూమిలో పోషకాల శాతాన్ని పెంచుకోవడానికి ముందుగా పచ్చిరొట్ట లేదా మినుము పంటను వేసుకుని భూమిలో కలియ దున్నాలి. దీనివలన భూమికి సహజ పోషకాలు లభిస్తాయి. 10-15 రోజుల తరువాత ట్రాక్టర్ కల్టివేటర్‌తో నేల మెత్తగా దుక్కి అయ్యేవరకు 1-3 సార్లు దున్నుకోవాలి.

విత్తనశుద్ధి

విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా చీడపీడల నుంచి దీర్ఘ కాలం పాటు పంటను రక్షించవచ్చు. మిరప విత్తనాలను మూడు రకాలుగా విత్తనశుద్ధి చేసుకోవచ్చు. వైరస్ తెగుళ్ల నివారణకు గాను కిలో మిరప విత్తనానికి గాను 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేటును ఒక లీటరు నీటిలో కరిగించి దీనిలో 15నుంచి 20 నిమిషాల పాటు విత్తనాన్ని నానబెట్టాలి. తర్వాత నీటిని తీసివేసి మంచి నీటితో శుభ్రంగా కడిగి విత్తనాలను నీడలో ఆరబెట్టుకోవాలి. రసం పీల్చు పురుగుల నివారణకు గాను కిలో విత్తనానికి 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ను పట్టించాలి. దీనివలన విత్తిన 20-25 రోజుల వరకు రసం పీల్చు పురుగుల ఉధృతి నివారణ జరుగుతుంది. బ్యాక్టీరియా, బూజు తెగుళ్ల నివారణకు గాను కిలో విత్తనానికి 3గ్రాముల మాంకోజెబ్ లేదా కాప్టాన్ మందును పట్టించి విత్తుకోవాలి. చివరిగా అదే విత్తనాన్ని ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రం పొడిని 5-10 గ్రాముల విత్తనానికి పట్టించి నారుమడిలో విత్తుకోవాలి.

విత్తన మోతాదు

మిరపను రెండు రకాల పద్ధతుల ద్వారా సాగు చేయవచ్చు. మిరప విత్తనాలను నేరుగా ప్రధాన పొలంలో విత్తడానికి అయితే ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది. అలా కాకుండా నారు పెంచుటకు విత్తన మోతాదు సూటి రకాలకు 650 గ్రాములు, హైబ్రిడ్ రకాలైతే 75 నుంచి 100 గ్రాముల విత్తనం సరిపోతుంది.

నారు పెంచే విధానం

మిరప నారును రెండు పద్ధతుల్లో పెంచవచ్చు. మిరప నారుమడికి సారవంతమైన ఒండ్రుసేలలు, నీటి వసతి, ఒక మోస్తరు నీడ కలిగిన ప్రదేశాలు చాలా అనుకూలం. ఒక మీటరు వెడల్పు, 40 మీటర్ల పొడవు, 15 సెం.మీ. ఎత్తుగల మడిలో ఒక ఎకరంలో నాటడానికి అవసరమైన నారు పెంచుకోవచ్చు. నారు పెంచటానికి నేలకు కొంచెం ఎత్తులో మట్టిని బెడ్డుగా చేసుకోవాలి. నాలుగు మూలలు సమాన ఎత్తులో ఉండేలా చూసుకోవాలి. నారుమళ్లలో విత్తనాలను 5 నుంచి 8 సెం.మీ. మధ్యదూరం, 1.5 సెం.మీ లోతులో వరుసల్లో విత్తనాలను పలుచగా విత్తుకోవాలి. విత్తిన 9వ రోజు, 13వ రోజున లీటర్ నీటిలో 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను కలిపిన ద్రావణంలో నారుమళ్లను తడపాలి.

ప్రోట్రేలలో..

ఈ పద్ధతిలో ప్రతి విత్తనం సమానంగా, ఆరోగ్యంగా మొక్కలు పెరిగి పంట ఒకేసారి కాపుకు వస్తుంది. దీనితో పాటు నారు దృఢంగా పెరగడంతో పాటు నారు కుళ్లు, వైరస్ తెగుళ్లను ఆశించే అవకాశం తక్కువగా ఉంటుంది. ఒక ఎకరా ప్రధాన పొలంలో నాటుటకు కావాల్సిన వారు 98 సెల్స్ కలిగిన 120 ట్రేలు సరిపోతాయి. ఒక్కో ప్రోట్రేను నింపుటకు సుమారు 1.2 కిలోల కోకోపీట్ మిశ్రమం అవసరం. ఒక్కొక్క సెల్‌లో ఒక్క విత్తనం నాటుకుని తిరిగి కోకోపీట్‌తో కప్పుకోవాలి. 6 రోజుల తర్వాత మొక్క మొలకెత్తడం ప్రారంభమయ్యాక వీటిని ఎత్తైన బెడ్లలోకి మార్చుకోవాలి.

మొక్కలను నాటుకునే విధానం

మొక్కలను నీటి వసతి నేలల్లో నాటుకునేప్పుడు 24×24 అంగుళాలు(ఇంచులు) లేదా 26×26 లేదా 28×28 అంగుళాల దూరంలో నేల స్వభావాన్ని బట్టి నాటుకోవాలి. మొక్కలు పెట్టడానికి తీసిన రంధ్రాల్లో కొద్దిగా నీరు పోసి వేర్లు మడత పడకుండా జాగ్రత్తగా నాటుకోవాలి. డ్రిప్ పద్ధతిలో నాటుకునేటప్పుడు మొక్కల మధ్య దూరం 30-45 అంగుళాలు అనువైనది.

కలుపు యాజమాన్యం

కలుపు నివారణకు మొక్కలు నాటిన 20-25 రోజుల తరువాత కలుపు గొర్రు లేదా గుంటుకలను ప్రతి 15-20 రోజులకు ఒక్కసారి దున్నాలి. ఎలా మొక్క నేల మొత్తాన్ని కప్పివేసేవరకు 4-5 సార్లు దున్నాలి. మొక్కలను నాటుకునే 1-2 రోజుల ముందు లీటర్ నీటిలో 1.5మిల్లీలీటర్ల పెండిమిథాలిన్ కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. పంటలో కలుపు మొక్కలు ఉన్నట్లయితే మొక్కలు నాటిన 25 రోజుల తర్వాత ఎకరానికి 400-500 మిల్లీలీటర్ల క్విజాలోఫాస్ ఇథైల్‌ను మొక్కలపై పడకుండా జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలి.